సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 16 । జూన్ । 2024

నాన్నకు ప్రేమతో..



ప్రపంచంలో అందమైన పదం అమ్మ... మధురమైన పిలుపు నాన్న.. అమ్మ జన్మనిస్తుంది. నాన్న జీవితాన్నిస్తాడు. అమ్మ నిజం.. నాన్న నమ్మకం.. బిడ్డల కోసం తన సంతోషాలను త్యాగం చేసేది.. పిల్లల భవిష్యత్ కోసం పరితపించే వ్యక్తి నాన్న. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా కథనం.

- వివరాలు 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రివేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

కలెక్టర్‌గా కుమార్‌దీపక్



కలెక్టర్ బదావత్ సంతోష్

- బదావత్ సంతోష్ బదిలీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కలెక్టర్‌గా కుమార్ దీపక్ నియామకం అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ప్రస్తుత కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా బది లీపై వస్తున్న కలెక్టర్ మూడేళ్ల క్రితం జిల్లాలోనే శిక్షణ కలెక్టర్‌గా పని చేయడంతో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, జిల్లా వాసులకు సుపరిచితమే. అప్పటి కలెక్టర్ భారతిహోళ్లికేరి స మయంలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. తాజాగా ఆయన ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. జిల్లా పరిస్థితులపై ప్రాథమికంగా అవగాహన కలిగి ఉన్నారు. ఆదివారం లేదా సోమవారం కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

జిల్లా కలెక్టర్‌గా బదావత్ సంతోష్‌కుమార్ గత ఏడాది ఫిబ్రవరి ఒకటిన బాధ్యతలు చేపట్టారు. పదహారు నెలలుగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించారు. పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారులు, జిల్లా ప్రజాప్రతినిధులతో జిల్లా అభివృద్ధికి తోడ్పడ్డారు. కింది స్థాయి సిబ్బందిపై చాలావరకు ఓపిగా ఉంటూ విధులు నిర్వర్తించారు. పలుమార్లు ఆదేశాలు ధిక్కరించే వారిపై చర్యలు చేపట్టారు. వీడియో, టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్షలు, సమావేశాల్లో పురోగతిపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతి తెలుసుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకున్నారు. గత ఏడాది జూన్‌లో కొత్త కలెక్టరేట్ ప్రారంభం సంతోష్ దంపతుల చేతుల మీదుగా కావడం విశేషం.



కుమార్ దీపక్

కలెక్టర్ ప్రొఫైల్

కుమార్‌దీపక్
ఐఏఎస్ బ్యాచ్ 2018
స్వస్థలం: సమస్తిపూర్, బీహార్
విద్యార్హత: బీటెక్(ఐఐటీ)
వివాహం: జరిగింది.
మంచిర్యాల జిల్లాలోనే శిక్షణ కలెక్టర్‌గా పూర్తి.
మొదటి పోస్టింగ్: అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పెద్దపల్లి.
ప్రస్తుతం: అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), నాగర్‌కర్నూల్.

న్యూస్‌రీల్

యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి



స్పోర్ట్స్ కిట్ పంపిణీ చేస్తున్న సీపీ

కోటపల్లి: యువత ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. శనివారం కోటపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని యువతకు చెడు అలవాట్లతో కలిగే నష్టాలు, ఉద్యోగసాధన, విద్య, ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై కళాబృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని అన్నారు. స్పోర్ట్స్ కోటాతో కూడా ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. గంజాయి, మద్యం, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్స్, జెర్సీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అశోక్, ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, శ్రీనివాస్, ఎస్సైలు రాజేందర్, శ్యాంపటేల్ పాల్గొన్నారు.

అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలి



రేంజ్ అధికారి సుష్మారావు

జన్నారం: అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలని తాళ్లపేట్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు అన్నారు. శనివారం జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కాగానే పోడు వ్యవసాయం పేరిట అటవీ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తారని అన్నారు. అడవిలో కొందరు విలువైన టేకు సంపదను నరుకుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. జీవ వైవిధ్యంలో అడవులు, వన్యప్రాణులు కూడా ఒక భాగమని భావించాలని, చిన్న చిన్న మొక్కలు పెద్దవిగా మారి భూమి సారవంతాన్ని కాపాడుతాయని పేర్కొన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ టూరిజం హబ్ మారుతోందని, ఇందుకు అనువైన సౌకర్యాల కల్పనకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వోలు ప్రమోద్‌కుమార్, తిరుపతి, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణ, పునరుద్ధరణకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.రాహుల్

పాతమంచిర్యాల: జిల్లాలో చెరువుల సంరక్షణ, పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ ఏఈ, టీపీవోలతో చెరువుల సంరక్షణ, పునరుద్ధరణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెరువులను గుర్తించి సరిహద్దులు ఏర్పాటు చేసి నీటి నిల్వలు, బఫర్‌జోన్‌లు, నీటి సరఫరా జరిగే ప్రాంతాలను గుర్తించి భౌగోళిక ప్రాదేశిక చిత్రాలను అభివృద్ధి చేయాలని అన్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువుల సంరక్షణకు జూలై 5న మైక్రోప్లానింగ్ రూపొందించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

పసిబిడ్డపై అఘాయిత్యం, హత్య అమానుషం

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆరేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి, హత్య చేసిన సంఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగరిక సమాజంలో ఇలాంటి దారుణమైన సంఘటనలు మానవత్వానికి సిగ్గుచేటని, పసిబిడ్డల ప్రాణం తీసే ఉన్మాద ఆలోచనలకు సమాజంలో చోటు లేదని, దారుణానికి పాల్పడిన మానవ మృగాన్ని పోలీసులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు వేగంగా దర్యాప్తు చేసి, దుర్మార్గుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను కోరారు. చిన్నారి కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేదని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

‘సాగు’డెట్లా..!



నెన్నెల గ్రామీణ బ్యాంకు వద్ద బారులు తీరిన రైతులు

- పెట్టుబడికి పైసలెట్లా..!
- ఖరారు కాని వార్షిక రుణ ప్రణాళిక
- రైతుబంధు రాలె.. రుణమాఫీ లెక్కలతోనే..
- అదును దాటుతోందని రైతుల ఆందోళన
- వడ్డీ వ్యాపారుల వైపు అన్నదాత చూపు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు పనులు ఊపందుకున్నాయి. నైరుతి రుతు పవనాలు సమీపించాయి. ఆకాశం మేఘావృతం అవుతూ మబ్బులు ఊరిస్తున్నాయి. జిల్లాలో అక్కడక్కడ చెదురు ముదురు వానలు కురుస్తున్నాయి. అన్నదాతలకు పంట పెట్టుబడి సమస్య మొదలైంది. ఇప్పటికీ బ్యాంకులు పంట రుణాల పంపిణీ ప్రారంభించలేదు. ఆర్థిక సంవత్సరానికి అందించే వార్షిక రుణ ప్రణాళిక ఖరారు కానేలేదు. దీంతో వానాకాలం సీజన్ ప్రారంభమై పంటలు సాగు చేసే అదును దాటుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ కారణంగా బ్యాంకర్లు రుణ ప్రణాళిక సిద్ధం చేయలేదు. కోడ్ ముగిసి పది రోజులు కావస్తున్నా స్పందన లేదు. యేటా బ్యాంకర్లు రైతులకు పంట పెట్టుబడికి రుణాలు మంజూరు, వ్యవసాయ అనుబంధ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలు, తదితర రుణాలు అందించేందుకు లక్ష్యం నిర్ధేశించి ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో రుణ ప్రణాళిక సిద్ధం కాకపోవడంతో రైతులు కొత్త రుణాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

అందని కొత్త రుణాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రైతులు గతంలో తీసుకున్న రుణాలు చెల్లించకుండా ఎదురు చూస్తున్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు గత ఏడాది తీసుకున్న రుణాలకు వడ్డీ పెరుగుతోంది. ఇప్పటికే తీసుకున్న డబ్బులకు వేలల్లో వడ్డీ బకాయి పడ్డారు. గత ఏడాది తీసుకున్న రుణాలు వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణం అందిస్తామని ఆయా బ్యాంకులు పేర్కొంటున్నాయి.

రైతుభరోసా అందలె..

గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులకు రైతుబంధు ఎకరానికి రూ.5వేల చొప్పున అందించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.7,500 చెల్లిస్తామని ప్రకటించింది. రైతుభరోసా పెట్టుబడి సాయం అందితే విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు ఆర్థిక భారం తప్పుతుందని రైతులు భావిస్తున్నారు. గతంలో జూన్ నెల నుంచి రైతుబంధు నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. ఇటు రైతు భరోసా, అటు రుణాలు అందక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం రుణమాఫీ బకాయి చెల్లిస్తే గానీ బ్యాంకులు రుణాలు అందించేలా కనిపించడం లేదు. దీంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి అధిక వడ్డీలతో డబ్బులు అందిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3.42లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

జిల్లాలో రూ.2లక్షలు రుణాలు పొందిన రైతులు 94,360 మంది వరకు ఉంటారు. కొందరు రైతులు వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకుంటున్నారు. ఇప్పటివరకు తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించిన వారు 20శాతం కూడా ఉండరని బ్యాంకర్లు పేర్కొంటున్నారు. గత ఏడాది పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోవడంతో తీసుకున్న రుణ మొత్తం, వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. బ్యాంకర్లు అందించే రుణాలతో విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు తదితర సాగు ఖర్చులకు అవసరమవుతాయని ఎదురు చూస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో రుణాల చెల్లింపు(రెన్యూవల్) ప్రక్రియ ప్రారంభం కావాలి. గత ఏడాది జూలై చివరి వారంలో కొత్త రుణాలు చెల్లింపు మొదలైంది. ఈ ఏడాది జూన్ సగం గడిచినా.. సాగు పనులు మొదలైనా రుణాలు అందడం లేదు.

రైతుభరోసా రాలే..



ఇప్పటికే దుక్కులు దున్ని చేను సిద్ధం చేసుకున్నా. రైతుబంధు, రుణమాఫీ అయితే.. కొత్త రుణం చేతికి అందితే విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఎదురుచూస్తున్నా. వానలు పడకముందే రైతుభరోసా సాయం అందితే పెట్టుబడికి ఇబ్బంది ఉండకపోవు. ఆలస్యం చేయకుండా రైతుభరోసా అందించాలి.

– సెగ్గ మోహన్, గ్రామం: కుందారం, మం: జైపూర్

అసలు, వడ్డీ చెల్లించమంటున్నారు..



రుణమాఫీ అయితే మీ ఖాతాలోనే పడుతుంది. వడ్డీ, అసలు చెల్లించి కొత్త రుణం తీసుకోవాలని బ్యాంకోళ్లు అంటున్నారు. పోయిన ఏడాది మొదట్లో వానలు లేక, పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలతో పంట నష్టపోవాల్సి వచ్చింది. పెట్టుబడి వెళ్లడం కష్టమైంది. లోన్ మొత్తం కట్టలేక రుణమాఫీ అయితదని ఎదురు చూస్తున్నాం. మాఫీ అయిత లేదు. కొత్త లోన్ ఇస్తలేరు. బయట అప్పుచేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాల్సి పరిస్థితి ఉంది.

– కే.రమణ, నెన్నెల

త్వరలోనే రుణ ప్రణాళిక సిద్ధం



జిల్లాలో ఆర్థిక సంవత్సరం వ్యవసాయ, అనుబంధ రుణాలు, ఇతరత్రా రుణ ప్రణాళిక రెండు మూడు రోజుల్లో సిద్ధం చేస్తున్నాం. పంట రుణమాఫీకి సంబంధించి బ్యాంకర్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాల్సిందే. అప్పుడే బ్యాంకర్లు కొత్తగా రుణాలు మంజూరు చేస్తారు.

– తిరుపతి, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్

ధాన్యం కొనుగోళ్లపై విచారణ



జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మికి అధికారుల సన్మానం



పాల్గొన్న ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, బొజ్జు

- గత ప్రభుత్వ పాలనలో రూ.500 కోట్ల కుంభకోణం
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- జెడ్పీ సమావేశంలో తీర్మానానికి సభ్యుల ఆమోదం
- చివరి సమావేశంలో జెడ్పీ ప్రజాప్రతినిధులకు గౌరవ సన్మానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత ప్రభుత్వ పాలనలో ధాన్యం కొనుగోళ్లలో జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల కుంభకోణం జరిగిందని, తాలు, తప్ప, తేమ పేరుతో క్వింటాల్‌కు 5కిలోల చొప్పున తరుగు తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సీబీసీఐడీ విచారణ జరిపిస్తామని, బాధ్యులెవరైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధరలో రైతులకు అన్యాయం జరుగుతోందంటూ అధికారులపై మండిపడ్డారు. జిల్లాలోని రైస్‌మిల్లులు, ధాన్యం కేటాయింపులు, చేరిన లక్ష్యాల నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని సూచించారు. పూర్తి నివేదిక ఇస్తామని అధికారులు చెప్పడంతో ఎమ్మెల్యే శాంతించారు. జిల్లాలో విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అధికారులపై వేటు పడేలా చర్యలు ఉంటాయని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ధాన్యం తరలింపు లక్ష్యసాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించే రైస్‌మిల్లర్లపై చర్యలు ఉంటాయని, వంతెనల నిర్మాణంలో అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా చూడాలని, వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన వారికి పరిహారం అందించేలా చూడాలని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ సమావేశాల్లో సభ్యులు లేవనెత్తే సమస్యలు తదుపరి జరిగే సమావేశంలోగా పరిష్కరించాలని అన్నారు. గొర్రెల పథకం అమలు చేసే అవకాశం లేనందున డీడీలు తిరిగి ఇవ్వాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పోడు భూములు సాగు చేస్తున్న వారిపై అటవీ అధికారులు ఎలాంటి దాడులకు పాల్పడకుండా చూడాలని సూచించారు. సమావేశంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, జెడ్పీ సీఈఓ గణపతి, జిల్లా శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం డిసెంబర్ నుంచి పెండింగ్‌లో ఉందని, సత్వరమే మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌కు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు వినతిపత్రం అందజేశారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం..

చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణతోపాటు జెడ్పీటీసీలు, ఎంపీపీల పదవీ కాలం పూర్తవ్వనుండడం, ఇదే చివరి సమావేశం కావడంతో అధికారులు ఘనంగా సన్మానించారు.

విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ సమస్యలపై ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నామని, వినియోగదారులు అర్జీలు సమర్పించవచ్చని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం ఆయా సెక్షన్ ఆఫీస్, సబ్ డివిజన్, ఈఆర్వో, డివిజన్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, బిల్లుల హెచ్చుతగ్గులు, ఇతర విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని తెలిపారు.

బ్యాంకు లింకేజీలో జిల్లాకు అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఆర్‌డీవో, అధికారులు

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధి కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ రుణాలు అందించడంలో జిల్లా రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5,977 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం రూ.358.58 కోట్లు కాగా రూ.420.18 కోట్లు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. లక్ష్యాన్ని అధిగమించి రుణాలు పంపిణీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండో స్థానంలో నిలిచింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 2024–25 ఆర్థిక సంవత్సరం స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ వార్షిక ప్రణాళిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిషన్, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరీ, కార్యదర్శి అనితలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అభినందించారు. ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. కాగా, డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీలో జిల్లాకు వరుసగా మూడు సార్లు అవార్డు లభించడం సంతోషంగా ఉందని తెలిపారు. 2021–22, 2022–23 సంవత్సరాలకు సైతం లక్ష్యాలను అధిగమించినందుకు అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో లక్ష్యాలను అధిగమించడానికి ఉద్యోగులు పని చేయాలని, జిల్లాను రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచేలా కృషి చేసిన ఉద్యోగులు, మహిళా సంఘాల నాయకురాళ్లకు అభినందించారు.

పేజీ చింపి.. పుస్తకాలు పంచారు



మంచిర్యాల ఎమ్మార్సీలో పుస్తకంలో పేజీ చింపి అతికిస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: సీఎం కేసీఆర్ అని ముందుమాటలో ముద్రించిన తెలుగు పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకున్న విద్యాశాఖ అధికారులు శనివారం పంపిణీ చేశారు. రెండ్రోజుల క్రితం విద్యార్థులకు పుస్తకాలు అందించగా ముందుమాట పేజీలో మాజీ సీఎం కేసీఆర్, పూర్వ విద్యాశాఖ మంత్రుల పేరిట అచ్చు కావడంతో అధికారులు హుటాహుటిన వెనక్కి తెప్పించారు. ఇంటింటా తిరిగి విద్యార్థుల నుంచి పుస్తకాలు సేకరించారు. మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో రెండ్రోజులుగా ముందుమాట పేజీని చింపి.. కవర్ పేజీ లోపలి వైపు ప్రతిజ్ఞ అతికించే పనిలో విద్యాశాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. చింపడం.. అతికించడం.. పంపిణీ చేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదేదో పుస్తకాలు పంపిణీ చేసినప్పుడే ఆయా ప్రధానోపాధ్యాయులకు పేజీ చింపి అతికించమంటే సరిపోయేదనే అభిప్రాయాలున్నాయి. తరగతిలో పంపిణీ చేసిన పుస్తకాలు సేకరించి ఎమ్మార్సీకి అందజేయడం.. మళ్లీ తీసుకెళ్లడం వరకు జిల్లాలోని ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

క్లుప్తంగా

పిడుగుపాటుతో ఎద్దు మృతి



ఎద్దు వద్ద బాధితుడు మల్లయ్య

తాండూర్: మండలంలోని వాల్మీకినగర్‌లో జంగెట్టి గట్టుమల్లయ్యకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందింది. శనివారం కురిసిన భారీ వర్షానికి పిడుగుపడడంతో ఇంటివెనకాల పంటచేనులో కట్టేసిన ఎద్దు మృత్యువాత పడింది. 15 రోజుల క్రితమే రూ.70 వేలతో జత ఎడ్లు కొనుగోలు చేశానని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. పశువైద్యాధికారి భూమయ్య మృతి చెందిన ఎద్దును పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. తలకు బలమైన గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బాధితునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే జైపూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి



రమేశ్‌గౌడ్ (ఫైల్)

జైపూర్: ఈ నెల 9న తాటిచెట్టు పైనుంచి కిందపడిన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొంగోని రమేశ్‌గౌడ్(56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య రజిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెరమెరి ఘాట్‌లో ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు గోలేటి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కారును ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో మహిళకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. క్షతగాత్రులను కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని కారు డ్రైవర్ సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రమశిక్షణతో పెంచారు



మంచిర్యాల టౌన్: మాది వరంగల్ జిల్లా హుజూరాబాద్ సమీపంలోని పోతిరెడ్డిపేట. మా అమ్మానాన్నలు భారతి, దేవేందర్‌రెడ్డి. మానాన్న సీకేఎం కాలేజీలో ల్యాబ్ డెమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మా అమ్మానాన్నల తండ్రులు ఉన్నత చదువులు చదివిన వారే కావడంతో నన్ను, మా తమ్ముడిని చిన్ననాటి నుంచి చదువుపైనే పూర్తి ధ్యాస పెట్టేలా చూసేవారు. ఏ చిన్న తప్పు జరిగినా శిక్షించి మరోసారి చేయకుండా క్రమశిక్షణతో పెంచారు. మా తమ్ముడు మహేశ్‌రెడ్డి ఇంజనీరింగ్ చేసి అమెరికాలో సెటిల్‌కాగా నేను డాక్టర్‌నయ్యాను. ఇప్పటికీ మా నాన్నను చూస్తే నాకు భయంతో కూడిన భక్తి ఉంది.

– డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్


నాన్నే నా తొలి గురువు



పాతమంచిర్యాల: నా జీవితంలో మా నాన్నే నా తొలిగురువు. నా చిన్నతనంలోనే మా అమ్మ చంద్రకళ చనిపోవడంతో నాన్న కనపర్తి జానకిరాములు అన్నీ తానై నన్ను ఉన్నతస్థితికి తీసుకొచ్చారు. ఉద్యోగ రీత్యా కళాశాల లెక్చరర్ అయినా నాచదువు విషయంలో చాలా శ్రద్ధచూపేవారు. ఆయన నేర్పిన క్రమశిక్షణ, నడవడిక వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను. నా మొదటి గురువు మానాన్నేనని గర్వంగా చెప్పుకుంటా.

– కే.విశ్వేశ్వర్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి, మంచిర్యాల

నాన్నకు ప్రేమతో..



- జన్మనిచ్చేది అమ్మ... • జీవితాన్నిచ్చేది నాన్న..
- పిల్లల కోసం సంతోషాలు త్యాగం..
- బతుకుదారి చూపుతున్న తండ్రులు • నేడు ఫాదర్స్‌డే..

ప్రపంచంలో అందమైన పదం అమ్మ... మధురమైన పిలుపు నాన్న.. అమ్మ జన్మనిస్తుంది. నాన్న జీవితాన్ని ఇస్తాడు. అమ్మ నిజం.. నాన్న నమ్మకం.. నవ మాసాలు మోసి తల్లి జన్మనిస్తే ...ఆ బిడ్డలను సాకి పెంచి పెద్ద చేయడానికి రెక్కలు ముక్కలు చేసుకుంటాడు తండ్రి. బిడ్డల కోసం తన సంతోషాలను త్యాగం చేసేది.. పిల్లల భవిష్యత్ కోసం పరితపించే వ్యక్తి నాన్నే.. బిడ్డలు ప్రయోజకులు అవుతుంటే తాను పడిన కష్టాలు మర్చిపోయి మురిసిపోయే నిస్వార్థజీవి. వంద మంది ఉపాధ్యాయులకు సమానమైన స్థాయి నాన్నది. అందుకే పితృదేవోభవ అంటారు. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా పిల్లల ఉన్నతి కోసం తమ జీవితాలను ధారబోసిన తండ్రులపై ప్రత్యేక కథనం.

బిడ్డల ఎదుగుదలకు నిచ్చెన..



నలుగురు కుమారులతో సత్తయ్య దంపతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి కార్మికుడు వెంబడి సత్తయ్యకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. అక్షర జ్ఞానం తెలియని వాడైనా కొడుకులను ఉన్నతంగా చదివించాలని ఆరాటపడ్డాడు. తండ్రి ఆశలకు అనుగుణంగా డిగ్రీలు చేసిన కుమారులు ఒక్కొక్కరుగా ఉద్యోగయత్నాలు చేశారు. పెద్దకుమారుడు రమేశ్ పోలీసుశాఖలో కానిస్టేబుల్, రెండో కుమారుడు భీమేశ్ ఎస్సై (ప్రస్తుతం సీఐ), మిగతా ఇద్దరు సురేష్, సంతోష్ సింగరేణిలో క్లర్క్‌లుగా పని చేస్తుండడంతో సత్తయ్య పడిన శ్రమ సత్ఫలితాలు ఇచ్చింది. భూగర్భంలో దిగి 39 ఏళ్ల పాటు సింగరేణిలో చెమట చిందించిన సత్తయ్య వచ్చిన డబ్బును దాచుకోకుండా బిడ్డల భవిష్యత్ కోసం ఖర్చుచేశాడు. కుమారులు ఉద్యోగాలు చేస్తుండటంతో ఆ తండ్రి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

ప్రయోజకుల్ని చేశాడు..



కుమారులతో దాసరి భూలింగు

కుంటాల: కుంటాలకు చెందిన రైతు దాసరి భూలింగు, గజ్జవ్వ దంపతులకు నలుగురు కుమారులు సంతానం. వారిని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు రమేశ్ ఉపాధ్యాయుడిగా, రెండో కుమారుడు మహేందర్ మెదక్‌లోని బీవీఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా, మూడో కుమారుడు ధనుంజయ్ ఎండీ, ఫిజీషియన్‌గా, చిన్నకుమారుడు రాజలింగు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కష్టపడి చదివించిన పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని భూలింగు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ అందుకున్న దంపతులు



తైక్వాండో రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో నాగలక్ష్మి, సరీష్

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన కరాటే కోచ్‌లు మోకెనపల్లి నాగలక్ష్మి, సరీష్ దంపతులు తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి కరాటే కోచ్‌లు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



తిలక్‌నగర్‌లో పట్టుబడిన దేశీదారు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని తిలక్‌నగర్‌లో దేశీదారు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. తిలక్‌నగర్‌కు చెందిన యేనం రాజు వద్ద నుంచి సుమారు లక్షా 50 వేల రూపాయల విలువ గల మహారాష్ట్రకు చెందిన 3 వేల దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్సై సురేశ్, సిబ్బంది శ్రీనివాస్, మల్లేశ్, సతీశ్, స్రవంతి పాల్గొన్నారు.

సీఎండీకి రిటైర్డ్ ఉద్యోగుల వినతి



వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబురావు, ఉప ప్రధాన కార్యదర్శి ఏ.వేణుమాధవ్ మాట్లాడుతూ అరకొర పెన్షన్‌తో చాలామంది రిటైర్డ్ ఉద్యోగులు దినదిన గండంగా బతుకుతున్నారన్నారు. ఓయన్‌జీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్నారని, సింగరేణిలో కూడా అమలు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బీరయ్య, వెంకటరమణ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

చాకెపల్లిలో కిడ్నాపర్ అంటూ వదంతులు



మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని చాకెపల్లిలో చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడన్న అనుమానంతో వ్యక్తికి దేహశుద్ధి చేసిన సంఘటన చోటుచేసుకుంది. చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ రవీందర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం చాకెపల్లిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్తులు పట్టుకుని 100కు కాల్‌చేశారు. పోలీసులు అతన్ని అరెస్టుచేసి విచారించగా అతని పేరు గోపి నాయక్ అని, తండ్రి పేరు కృష్ణ నాయక్ అని ఒడిశా నుండి మేషన్ పని నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. కొద్దిగా మతిస్థిమితం లేనట్టు ప్రవరిస్తున్నాడన్నారు. ఎక్కడి నుంచో 18 మంది వచ్చారని సోషల్ మీడియాలో వస్తున్నది నిజం కాదన్నారు. ఇలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

తెలంగాణ ధాన్యం ఏపీకి తరలింపు



లారీలో బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

భీమారం: మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోని గోదాంలో నిల్వ ఉన్న వరిధాన్యం బస్తాలను శనివారం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు లారీల్లో తరలించారు. ప్రభుత్వం వాటికి ఇటీవల టెండర్ నిర్వహించగా కేంద్రీయ బండార్ టెండర్ ద్వారా కొనుగోలు చేసింది. ఈమేరకు భీమారం గోదాంలో ఉన్న 1400 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 500 మెట్రిక్ టన్నులు తూర్పుగోదావరి జిల్లాకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారుల సమక్షంలో లారీల్లో తరలిస్తున్నారు.

భూతగాదాలో 35 మందిపై కేసు

బెజ్జూర్: భూతగాదా కేసులో శనివారం 35 మందిపై కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రం తెలిపారు. మండలంలోని మర్తడి శివారులోని సర్వే నెం .167/2, 167/3, 167/4, 167/5 లలో 48 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, ఆ భూమిని 2011లో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన గజ్జల శ్రీనివాస్, అతని సోదరులు 34 ఎకరాలు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అందులో నుంచి కొంత భూమి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కాలువల నిర్మాణాలలో పోగా, మిగతా 14 ఎకరాల భూమి ఉందని తెలిపారు. భూపాలపల్లికి చెందిన బిక్షపతి గౌడ్ అనే వ్యక్తి ఆ భూమిని తాను 2021లో కొనుగోలు చేశానని, తమకు కూడా భూమి ఉందని పేర్కొంటుండటంతో ఇరువర్గాల మధ్య భూతగాదాలు జరుగుతున్నాయన్నారు. గజ్జల సురేశ్, ఎండి ఇసాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 35 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోణంపేట విద్యార్థినికి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు



నైతం శ్రావణి

నెన్నెల: బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామమైన కోణంపేటకు చెందిన గిరిజన విద్యార్థిని నైతం శ్రావణి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించింది. ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్టీ కోటాలో ఆలిండియాలో 263వ ర్యాంకు సాధించింది. శనివారం నిర్వహించిన మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో సీటు దక్కింది.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం




కాలిన మంచం, బెడ్ సీట్లు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శేక్ బాబుమియాకు చెందిన ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. ఫ్యాన్‌కు సంబంధించిన వైరులోంచి మంటలు చెలరేగడంతో ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. సుమారు రూ.60 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిపై కేసు

భీమారం: సోషల్ మీడియాలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. జోడువాగుల బ్రిడ్జిపై తప్పులు ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా రాజ్‌కుమార్ పోస్టులు పెట్టినట్లు కాంగ్రెస్ నాయకుడు షెడంరెడ్డి రమేశ్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట మహిళల ధర్నా



నినాదాలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి: మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించి దుర్వాసన నుంచి కాపాడాలని బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామ మహిళలు శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని కుర్మ వాడలో మురికినీటి కాలువలు పూడిక తీతకు నోచుకోక పోవడంతో చెత్త చెదారం నిండి కంపు కొడుతున్నాయన్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కుభీర్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పీ.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన కొంగర్ల లక్ష్మణ్ (55)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తున్న వర్కర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లు శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద్ మాట్లాడుతూ హాస్టళ్లలో పనిచేసే కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, స్కావేంజర్‌కు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నెన్నెల: పదోన్నతులు కల్పించడంలో తీవ్ర అన్యాయం జరిగిందని నార్వాయిపేట ప్రాథమికోన్నత పాఠశాల ఎస్జీటీలు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాలకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు భీంపుత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు కావాల్సిన అర్హత ఉండి 20ఏళ్లకుపైగా ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఎస్జీటీలకు నష్టం జరుగుతుండడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఆలోచించి ఎస్జీటీలకు పదోన్నతుల్లో సమాన అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడును విన్నవించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీలు సదయ్య, స్నేహలత పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: మున్సిపల్ అభివృద్ధికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ కల్లెడ రాజశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల పనులు ప్రారంభం

మండల కేంద్రంలో నూతనంగా చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కా భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను వేగవంతంగా నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్మాణం మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మార్కెట్ కమిటీ సభ్యులు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. చైర్మన్ దాసరి ప్రేంచంద్, వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, డైరెక్టర్లు గాండ్ల విజయ్‌కుమార్, కనక జంగు, కట్కూరి రాజన్న, గోపతి సునీత, తోట రమేశ్, పాలుసాని రవీందర్, బండ రాకేష్, బొప్పు వెంకటేష్, గంగుల వెంకటస్వామి, బుచ్చయ్య, బీరెల్లి రాజన్న, మల్యాల గణపతిస్వామిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నం మంగ, దండెపల్లి ఎంపీపీ శ్రీనివాస్, మార్కెట్ ఏడీ గజానంద్, సెక్రటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'18న ధర్నా విజయవంతం చేయాలి'

కోటపల్లి: అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు ఆపాలని ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం కోరారు. శనివారం రొయ్యలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో హక్కుపత్రాలు వచ్చిన భూముల్నికూడా అటవీశాఖ అధికారులు దున్నుకోనివ్వడంలేదన్నారు. సమావేశంలో ముత్తయ్య, రాజేశ్, మల్లేశ్, సదవలి, పుష్పలత, మహేశ్వరి, మారయ్య, బాపు పాల్గొన్నారు.